క్లుప్తంగా

ఎస్సైగా ఎంపికైన నరసాపురం యువతి


సోనీని సత్కరిస్తున్న దృశ్యం

నరసాపురం: ఎస్సైగా ఎంపికైన నరసాపురం మండలం వేములదీవి గ్రామానికి చెందిన బొక్కా సోనీకి పలువురు అభినందించారు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన సోనీ 10వ తరగతి వరకూ గ్రామంలోనే చదవుకోగా, ఇంటర్, డిగ్రీ పట్టణంలోని శ్రీ సూర్యా కళాశాలలో పూర్తి చేసింది. శుక్రవారం కళాశాలలో సోనీని కళాశాల యాజమాన్యం సత్కరించింది. సోనీ యువతకు ఆదర్శమని కళాశాల కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ అన్నారు. భవిష్యత్‌లో ఆమె మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఎండీఎంను సద్వినియోగం చేసుకోవాలి


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎండీఎం కోఆర్డినేటర్ కృష్ణారావు

పోడూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోన్న మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం)ను సద్వినియోగం చేసుకోవాలని ఎండీఎం జిల్లా కోఆర్డినేటర్ కె.కృష్ణారావు విద్యార్థులకు సూచించారు. జిన్నూరులోని ఏఎస్ఆర్ జెడ్పీ హైస్కూల్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. హైస్కూల్లో వంటకాల తయారీ, బియ్యం, కోడిగుడ్లు, చిక్కీ నిల్వలను పరిశీలించారు. భోజనాన్ని రుచిచూసి విద్యార్థులకు భోజనం వడ్డించారు. ఆయన వెంట ఎంఈఓలు జి.విజయకుమార్, జీవీ సూర్యనారాయణ, హెచ్ఎం సీహెచ్ శివజ్యోతి, పీసీ చైర్మన్ యడ్ల రమేష్, సీఆర్పీ కె.భారతి ఉన్నారు.

7 షాపులకు వేలం ఖరారు

నరసాపురం: స్థానిక మండ సత్యనారాయణ మూర్తి, ఫిష్ మార్కెట్ మున్సిపల్ కాంప్లెక్స్‌ల్లో ఖాళీగా ఉన్న 20 షాపులు లీజుకిచ్చే నిమిత్తం శుక్రవారం బహిరంగవేలం నిర్వహించారు. అయితే 13 షాపులకు పాటుదారులు రాకపోవడంతో వాయిదా వేశారు. మిగిలిన 7 షాపులకు పాట నిర్వహించి హెచ్చు పాటదారులకు మూడేళ్ల కాలపరిమితితో షాపులను అప్పగించారు. మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఆర్ఐ నానాజీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి

నరసాపురం: నరసాపురం నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చి పనిచేస్తున్నామని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. స్థానిక రెండో వార్డులో రూ.12 లక్షలతో నిర్మించిన సీసీ రహదారిని శుక్రవారం ఆయన వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంట్ నియోకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో అన్ని రహదారులను అభివృద్ధి చేశామని చెప్పారు. లింక్‌రోడ్లు కూడా నిర్మించామన్నారు. ప్రభుత్వం ఓవైపు సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తూనే అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తోందని చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, పార్టీ పట్ట మహిళా అధ్యక్షురాలు కాగిత సత్యవేణి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి కృషి

మొగల్తూరు: నరసాపురం నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నామని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శుక్రవారం పేరుపాలెం నార్త్ పంచాయతీలో రూ.9 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ముత్యాలపల్లి నుంచి మోడి, పేరుపాలెం సౌత్‌లను కలుపుతూ మోళ్లపర్రు బీచ్ వరకు రూ.28 కోట్లతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ రూ.1.70 కోట్లతో పసలదీవి - రామన్నపాలెం రోడ్డు నిర్మించుకున్నామని, రూ.9 కోట్లతో కొత్తోట - దెయ్యాలతిప్ప, జిల్లేడుతిప్ప, నీటితిప్ప, కోమటితిప్ప రోడ్డు పనులకు ఇటీవల శంకుస్థాపన చేశామని చెప్పారు. ముత్యాలపల్లి - వయా మోడి పేరుపాలెం సౌత్ మీదుగా మోళ్లపర్రు బీచ్ వరకు రూ.28 కోట్లతో రోడ్డు పనులు చేపట్టామని, కాళీపట్నం - జగన్నాథపురం వయా పాతపాడు వరకు రూ.12 కోట్లతో చేపట్టిన రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయని, ఇందులో భాగంగానే కాళీపట్నం కాలువపై రెండు లైన్ల వంతెన నిర్మాణం పూర్తయిందని వివరించారు. మొగల్తూరు నుంచి నరసాపురం మండలం బేతపూడి వరకు రూ.12.64 కోట్లతో చేపట్టిన రోడ్డు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పేరుపాలెం నుంచి మొగల్తూరు వయా కొత్తకాయలతిప్ప వరకు రూ.2.50 కోట్లతో చేపట్టిన రహదారి పనులు ఇటీవల ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంట్ నియోకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల, నాయకులు అందే భుజంగరావు, కవురు సాయి, కర్రి ఏసుబాబు, కటికల సూర్యారావు, రామరాజు, నేదునూరి శ్రీను, బొక్కా శ్రీను తదితరులు పాల్గొన్నారు.


నరసాపురం : రోడ్డును ప్రారంభిస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు, పార్లమెంట్ నియోకవర్గ ఇన్‌చార్జి ఉమాబాల


మొగల్తూరు : పేరుపాలెం నార్త్‌లో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు


మొగల్తూరు : ముత్యాలపల్లి - మోళ్లపర్రు రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ప్రసాదరాజు

త్వరలో అందుబాటులోకి ఆడిటోరియం


నరసాపురం: మున్సిపల్ ఆడిటోరియం పనులను పరిశీలిస్తున్న ప్రసాదరాజు, ఉమాబాల

నరసాపురం: పట్టణంలో రూ.3.30 కోట్లతో నిర్మిస్తోన్న మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియం త్వరలో అందుబాటులోకి వస్తుందని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. చురుగ్గా సాగుతున్న ఆడిటోరియం పనులను శుక్రవారం ముదునూరి వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంట్ నియోకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాలతో కలిసి పరిశీలించారు. పనులు మరింతవేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆడిటోరియం ముందున్న ఫైర్‌స్టేషన్ అధికారులతో ఆయన మాట్లాడారు. ఫైర్‌స్టేషన్‌ను వేరే ప్రాంతానికి మార్చాలని మున్సిపాలిటీ స్థలం కూడా సమకూర్చిందని చెప్పారు. నిరుపయోగంగా ఉన్న మున్సిపల్ ఓపెన్‌ఎయిర్ థియేటర్‌ను పడగొట్టి ఓపెన్ ఆడిటోరియం నిర్మిస్తున్నామని తెలిపారు. తక్కువ అద్దెతో ప్రజలకుఅ ందుబాటులో ఉండే విధంగా ఆడిటోరియం నిర్మిస్తున్నామని చెప్పారు.

బీసీ మహిళలకు అందలం

ఓబీసీ మహిళైన తనకు ప్రతిష్టాత్మకమైన నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు ఇచ్చి, పోటీలో నిలవడానికి అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని బీసీ లోకం మరిచిపోలేదని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగన్ రాష్ట్రంలో సువర్ణపాలన సాగిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, అందే భుజంగరావు, కౌన్సిలర్లు వైకేఎస్, కేసరి గంగరాజు, మల్లాడి బుజ్జి, గోరు సత్తిబాబు, వంగా శ్రీకాంత్‌కన్నా, జిల్లెళ్ల దిలీప్, పతివాడ పద్మ పాల్గొన్నారు.

జుత్తిగ చెరువుగట్టు అభివృద్ధికి ఆమోదం

పెనుమంట్ర: జుత్తిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న ఊర చెరువుగట్టును క్రీడాప్రాంగణంగా అభివృద్ధి చేసేందుకు గ్రామ సచివాలయ వార్డు సభ్యుల సర్వసభ్య సమావేశం ఆమోదించింది. గ్రామ సర్పంచ్ తమనంపూడి వీరారెడ్డి అధ్యక్షతన శుక్రవారం వార్డు సభ్యుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. హైస్కూల్ విద్యార్థుల కోసం పడమర వైపు గట్టును క్రీడా ప్రాంగణంగా, మిగిలిన గట్లను పబ్లిక్ వాకింగ్ ట్రాక్‌గా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సభ్యులు తీర్మానించారు. గ్రామ పంచాయతీకి వచ్చిన రూ.5 లక్షల 15వ ఆర్థిక సంఘ నిధులతో రైతు భరోసా కేంద్రం వద్ద పల్లెపాలెంలోని డ్రెయిన్స్ నిర్మాణానికి ఆమోదం తెలిపారు. గ్రామ పంచాయతీ వద్ద సంధ్యా జ్యోతి వృద్ధాశ్రమం అధినేత గుడిమెట్ల రామకృష్ణారెడ్డి దాతృత్వంతో రచ్చబండ నిర్మాణానికీ ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుత్తుల వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు పడాల సుబ్బిరెడ్డి, గుడిమెట్ల సత్యనారాయణరెడ్డి, యార్లగడ్డ వరలక్ష్మి, గూడూరి భాగ్యలక్ష్మి, తమనంపూడి శ్రీనివాసరెడ్డి, గుడిమెట్ల రమాజ్యోతి పాల్గొన్నారు.

అవార్డులకు వలంటీర్ల ఎంపిక

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండలం కాపవరం గ్రామానికి చెందిన వలంటీర్ కందికట్ల ప్రసన్న, వెలివెలకు చెందిన కాకర్లపూడి ప్రియాంక వజ్ర అవార్డులకు ఎంపికయ్యారని మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.గోవిందరాజులు తెలిపారు. గుబ్బల సూర్యప్రకాష్ (పూలపల్లి), అందే జయసురేష్ (చింతపర్రు), విశ్వనాథం దివ్య పరదేశి గణేష్‌కుమార్ (భగ్గేశ్వరం), అంగర నాగ జయలక్ష్మి (బల్లిపాడు), చిట్టూరి ప్రసన్న లక్ష్మి (దగ్గులూరు) రత్న అవార్డులకు, మండలంలో పని చేస్తున్న వలంటీర్లు అందరూ సేవా మిత్ర అవార్డులకు ఎంపికయ్యారని చెప్పారు. వజ్ర, రత్న, సేవా మిత్ర అవార్డులకు వరుసగా రూ.45 వేలు, రూ.30వేలు, రూ.15 వేలు నగదుతోపాటు మెడల్, ప్రశంసా పత్రం, శాలువాతో సత్కరించనున్నట్లు తెలిపారు.

ఆలయాల్లో రథసప్తమి పూజలు

పాలకొల్లు సెంట్రల్: రథసప్తమి సందర్భంగా శుక్రవారం పాలకొల్లు పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కెనాల్ రోడ్డు దాసోహాంజనేయ స్వామి ఆలయంలోని వేంకటేశ్వరస్వామి సూర్యభగవానుని అలంకరణలో పూజలు అందుకున్నారు. యడ్లబజారు సెంటర్‌లో కొలువై ఉన్న పంచముఖ అంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి సామూహిక సహస్రనామార్చనలు నిర్వహించారు. రాత్రి సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. చినగోపురం అష్టభుజ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో స్వామివారిని సూర్యప్రభ, శేషవాహనం, హనుమ, గరుఢ, చంద్రప్రభ వాహనాలపై ఊరేగించారు. చిన్న కూరగాయల మార్కెట్‌లో కొలువై ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సరస్వతి శిశుమందిర్, సరస్వతి నగర్ ప్రాంగణంలో సూర్యనారాయణస్వామి దివ్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ధార్మిక సామాజిక పరిషత్, పాలకొల్లు ఆధ్వర్యంలో ప్రతి ఆదివారమూ నిర్వహిస్తోన్న సూర్యహోమం 194వ వారానికి చేరిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో శృంగవృక్షం దత్త పీఠం సాయిదత్త నాగానంద సరస్వతి స్వామీజీ పాల్గొన్నారు. ఆర్యవైశ్య కల్యాణ మండపంలో యోగా, సూర్యనమస్కార కార్యక్రమాలు నిర్వహించారు. అలయాలు ట్రస్ట్‌బోర్డు సభ్యులు, అధికారులు, కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటుచేశారు.

వైభవంగా సూర్యదేవుని కల్యాణం

పెనుమంట్ర: రథసప్తమిని పురస్కరించుకుని జుత్తిగ ఉమావాసుకి రవి సోమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సూర్యభగవానుడి కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో కర్రి నాగ సతీష్‌రెడ్డి, ప్రదీప్తి దంపతులు కల్యాణం చేశారు. ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్య భగవానుడిని విశేషంగా అలంకరించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

రథ సప్తమి పూజల్లో గుడాల గోపి

పాలకొల్లు అర్బన్ : రథసప్తమి పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివదేవునిచిక్కాలలో పార్వతీ సమేత శివదేవస్వామి ఆలయం, దిగమర్రులో ఉమా సరేంద్ర స్వామి ఆలయంలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పాలకొల్లు పట్టణంలోని సూర్యనారాయణస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. యడ్లబజారులో దుర్గామల్లేశ్వరస్వామివారినీ గోపి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పాలకొల్లు సెంట్రల్: సూర్యనారాయణమూర్తి అలంకరణలో వేంకటేశ్వరస్వామి


పాలకొల్లు సెంట్రల్: సూర్యనారాయణమూర్తి కల్యాణంలో పాల్గొన్న దంపతులు


పాలకొల్లు సెంట్రల్: శేష వాహనంపై ఊరేగుతున్న అష్టభుజ లక్ష్మీనారాయణస్వామి


పాలకొల్లు అర్బన్ : సూర్యనారాయణస్వామిని దర్శించుకున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గోపి


పెనుమంట్ర : జుత్తిగలో సూర్యభగవానుడి కల్యాణం నిర్వహిస్తున్న కర్రి నాగసతీష్‌రెడ్డి, ప్రదీప్తి దంపతులు

వైభవంగా త్రిపురాంతకేశ్వర స్వామి కల్యాణోత్సవం

పోడూరు: కవిటంలో అతిరుద్ర మహాయాగ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి శ్రీ త్రిపురాంతకేశ్వర స్వామి కల్యాణ వేడుకను వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల, జగదీష్ దంపతులు పీటలపై కూర్చుని కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివారి పల్లకీని మోశారు. కార్యక్రమంలో యాగ మహోత్సవం నిర్వాహకులు జంధ్యాల శ్రీనివాస శర్మ, (నెలమూరు శర్మ), పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


స్వామివారి పల్లకీ మోస్తున్న ఉమాబాల, జగదీష్ దంపతులు


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

నేటి నుంచి ధ్వజ స్తంభాల ప్రతిష్ఠామహోత్సవాలు

పెనుమంట్ర: దేవదాయ శాఖకు చెందిన మార్టేరులోని ఉమా బ్రహ్మేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి ఆలయాల్లో ముఖ మండపంతో పాటు ధ్వజ స్తంభాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహించనున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు వెలగల శత్రుఘ్నరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న పూర్ణ కలశంతో గోమాత గ్రామ ప్రదక్షిణ, 18న విఘ్నేశ్వరపూజ, మండపారాధన, యంత్ర వెండి ధ్వజంకు మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈనెల 19న ఉదయం 10.38 గంటలకు గ్రామానికి చెందిన మేడపాటి శ్రీనివాసరెడ్డి, సత్యభవాని దంపతులచే ఉమా బ్రహ్మేశ్వరస్వామి ఆలయ ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, 10.39 గంటలకు మల్లిడి రాజారెడ్డి రాజేశ్వరి దంపతులచే రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయ ధ్వజ స్తంభ పునః ప్రతిష్ఠ చేయనున్నట్టు వివరించారు. అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన ఉంటుందని తెలిపారు. పరిసర గ్రామాల భక్తులంతా ఈ కార్యక్రమాల్లో పాల్గొని, స్వామివారిని దర్శించుకుని, అన్న ప్రసాదాలను స్వీకరించాలని ఆయన కోరారు.


ప్రతిష్ఠాపనకు సిద్ధం చేసిన ధ్వజ స్తంభాలు

9న జాతీయ లోక్ అదాలత్

పాలకొల్లు సెంట్రల్: వాదించుకుంటే ఎవరో ఒక్కరే గెలుస్తారని, సమస్యను పరిష్కరించుకుంటే ఇరువురికీ ఆమోదయోగ్యమైన తీర్పు పొందవచ్చని మండల న్యాయ సేవాదికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్ అన్నారు. శుక్రవారం కోర్టు హాలులో ఏర్పాటుచేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. మార్చి 9న ఉదయం 10 గంటల నుంచి స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. చిన్నచిన్న వివాదాలు పెద్దవి కాకుండా పరిష్కరించుకుంటే ఎవ్వరికీ పట్టుదలలు పెరగవని, కోర్టుల చుట్టూ తిరిగే సమస్య, సమయం, నగదు వృథా కాకుండా ఉంటాయని సూచించారు. కార్యక్రమంలో ఏపీపీ జయసింహ, ఏజీపీ చిట్టిబాబు, మునిసిపల్ కమిషనర్, పాలకొల్లు పట్టణ, రూరల్, ఆచంట, పోడూరు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న జడ్జి పవన్‌కుమార్

కాపు క్లబ్ సభ్యుల వితరణ

యలమంచిలి: కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన దైవసేవని కాపు యునైటెడ్ ఇంటర్నేషనల్ క్లబ్ పాలకొల్లు శాఖ అధ్యక్షుడు గాది ఆంజనేయులు అన్నారు. మేడపాడులో ఇటీవల వలంటీర్ గంధం అయ్యప్ప, ఏడాది క్రితమే అతని తండ్రి మరణించారు. దీంతో ఒంటరిగా మిగిలిన అయ్యప్ప తల్లి నాగలక్ష్మికి రూ.10 వేలు, మేడపాడులో కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోన్న గంధం శివరామకృష్ణకు రూ.10 వేలు సాయం శుక్రవారం అందజేశారు. క్లబ్ గవర్నర్ డాక్టర్ ముచ్చర్ల సంజయ్, కార్యదర్శి పశ్యావుల రవి, కోశాధికారి వినుకొండ శేషాద్రి సభ్యులు గుర్రాల వెంకట్రావు, లంకలపల్లి ఖగ వెంకట శేషాద్రిరావు (ఖగరాజు) దేగల వెంకటేశ్వరరావు, గాది శ్రీనివాస్, కొప్పిశెట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి

పాలకొల్లు అర్బన్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రలోభాలకు గురికాకుండా, ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని డీఎస్పీ కె.రవి మనోహరాచారి సూచించారు. పాలకొల్లు మండలం సగంచెరువు, దిగమర్రు గ్రామ సచివాలయ ఆవరణలో శుక్రవారం ఏర్పాటుచేసిన ఓటర్ల అవగాహన సదస్సులో డీఎస్పీ మాట్లాడారు. సైబర్ నేరాలు పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాలను నమ్మవద్దని, ఓటీపీలు ఓకే చేయకూడాదని, బ్యాంక్ ఖాతాలు, లేదా తెలియని వ్యక్తులు ఫోన్‌లో సమాచారం అడిగితే ఇవ్వకూడదని హెచ్చరించారు. ఆధార్ నెంబరు కూడా చెప్పకూడదన్నారు. అనుమానాస్పద వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కోడిపందాలు, పేకాట, ఇతర జూద క్రీడలు చట్టరీత్యా నేరమన్నారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు రాపాక నగేష్ కరుణాకర్, కడలి నాగమణి, పంచాయతీ కార్యదర్శులు ఓదూరి సూర్యప్రకాశరావు (రాజా), ఎం సేవా కిషోర్, సీఐ కుడిపూడి సతీష్, ఎస్సై డి.హరికృష్ణ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ రవి మనోహరాచారి

నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండలంలో సుమారు రూ.6.50 కోట్లతో నిర్మించిన గ్రామ సచివాలయ, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను శనివారం ప్రారంభించనున్నట్టు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథులుగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల పాల్గొంటారని పేర్కొన్నారు. వీరు ఉదయం 9 గంటల నుంచి శివదేవునిచిక్కాలలో రైతు భరోసా కేంద్రం, బల్లిపాడుగరువులో గ్రామ సచివాలయ భవనం, దగ్గులూరులో గ్రామ సచివాలయ భవనం, లంకలకోడేరులో గ్రామ సచివాలయ భవనం, ఆర్బీకే, రూ.1.50 కోట్లుతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అరట్లకట్టలో ఆర్బీకే, కాపవరంలో గ్రామ సచివాలయ భవనం, వడ్లవానిపాలెంలో బీసీ కమ్యూనిటీ హాలు భవనాలను ప్రారంభిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఆగర్రులో ఆర్బీకే, ఆగర్తిపాలెంలో ఆర్బీకే, సగంచెరువులో వైఎస్సార్ హెల్త్ సెంటర్, కొత్తపేటలో గ్రామ సచివాలయ భవనం, వైఎస్సార్ హెల్త్ సెంటర్‌లను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. 5 గంటలకు యలమంచిలి మండలం బాడవలో సచివాలయ భవనం, వైఎస్సార్ హెల్త్ సెంటర్ భవనాలను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని గోపి కోరారు.


దిగమర్రులో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం